# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 44 | పేజీలు: 5 | వెల: రూ.4/- | సోమవారం 6 అక్టోబర్ 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


### జంటజలాశయాలకు
## కొనసాగుతున్న వరద

**హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే ఉదయం)**

ఎగువన భారీ వర్షాలతో హైదరాబాద్‌లోని జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లకు వరద ప్రవాహం కొనసాగుతున్నది. దీంతో జలమండలి అధికారులు ఉస్మాన్‌సాగర్ ఆరు గేట్లను 4 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం చెరువులోకి 2 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా, 2652 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఉస్మాన్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1790 అడుగులకు గాను 1789 అడుగుల వద్ద నీరు ఉన్నది. నీటి నిల్వ సామర్థ్యం 3.90 టీఎంసీలు. ప్రస్తుతం 3.71 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

# బీసీ రిజర్వేషన్ల జీవోపై ఉత్కంఠ

### నేడు సుప్రీంకోర్టులో విచారణ
### బలమైన వాదనలు వినిపించాలన్న ముఖ్యమంత్రి
### రేవంత్ ఆదేశంతో ఢిల్లీకి భట్టి, పొన్నం, వాకిటి శ్రీహరి
### న్యాయవాదులతో భేటీ




**హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే ఉదయం)**

హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోపై సోమవారం సుప్రీంకోర్టులో, 8న హైకోర్టులో విచారణ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. స్థానిక సంస్థల ఎన్నికల తొలిదశ నోటిఫికేషన్‌ను ఈ నెల 9న జారీచేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు జారీచేసిన జీవోపై సుప్రీంకోర్టులో జరగనున్న విచారణపై ఉత్కంఠ నెలకొంది. ఈ జీవో చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటు అధికారులను, అటు పార్టీ నేతలను ఆదేశించారు. ఈ అంశంపై ఆదివారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలు సుదీర్ఘంగా చర్చించి సీఎంకు వివరాలు తెలిపారు. సీనియర్ న్యాయకోవిదులతో ముందే మాట్లాడాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో భట్టి, పొన్నం, వాకిటి శ్రీహరి ఆదివారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. స్థానిక సంస్థలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రచార కార్యాచరణపైనా చర్చించినట్లు నేతలు తెలిపారు. భాజపా ఓటు చోరీకి వ్యతిరేకంగా ఈ నెల 16లోగా గ్రామగ్రామాన సంతకాల సేకరణ పూర్తిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని మీనాక్షి చెప్పినట్లు సమాచారం.

**రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం: పొన్నం**

ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సమావేశం అనంతరం... మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు తీసుకుంటున్న చర్యలను కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇది ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన రిజర్వేషన్లకు ఎలాంటి నష్టం కలిగించేది కాదని.. కోర్టుల్లో పిటిషన్లు దాఖలుచేసిన వారికి విజ్ఞప్తి చేస్తున్నానని ఆయన చెప్పారు. బలహీన వర్గాలకు చేయూతనివ్వాలనే సదుద్దేశంతో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాహుల్‌గాంధీ ఆలోచనల అమలు ప్రక్రియలో భాగంగానే రిజర్వేషన్లను పెంచామన్నారు. అన్ని రాజకీయ పార్టీల ఏకాభిప్రాయంతో అసెంబ్లీలో రిజర్వేషన్ల పెంపు బిల్లు ఆమోదం పొందిందని ఆయన గుర్తుచేశారు.



### విజయవాడ-హైదరాబాద్ హైవేపై
## వాహనాల రద్దీ

**చౌటుప్పల్, అక్టోబర్ 5 (నమస్తే ఉదయం)**

దసరా పండగకు సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు సెలవులు ముగియడంతో రాజధాని హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరాయి. దారి పొడవునా రద్దీ కొనసాగడంతో వాహనాలు ఆగుతూ.. నెమ్మదిగా కదిలాయి. నార్కట్‌పల్లి కామినేని జంక్షన్, చిట్యాల, పెద్దకాపర్తి, పంతంగి టోల్‌ప్లాజా, చౌటుప్పల్ వద్ద వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద రోజుకు 25వేల వాహనాలు వెళ్తుండగా.. శనివారం ఒక్క రోజే 34వేలు, ఆదివారం సాయంత్రం ఐదు గంటల వరకు 27వేలు వెళ్లాయి. పంతంగి టోల్‌ప్లాజా వద్ద రోజుకు 40వేల వరకు వాహనాలు వెళ్తుండగా.. శనివారం ఒక్క రోజే 51వేల వరకు వెళ్లాయి. ఆదివారం సాయంత్రం ఐదు గంటల వరకు 49వేల వాహనాలు వెళ్లినట్లు టోల్‌ప్లాజా అధికారులు వెల్లడించారు. రద్దీ నేపథ్యంలో పంతంగి టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్ మార్గంలోనే 12 టోల్ బూత్‌లను తెరిచారు. మొత్తం ఇక్కడ 16 టోల్ బూత్‌లు

..మిగతా 2లో

# కొండచరియలు విరిగిపడి 17 మంది దుర్మరణం

### శిథిలాల కింద మరింత మంది.. డార్జిలింగ్‌లో బీభత్సం



**డార్జిలింగ్, అక్టోబర్ 5 (నమస్తే ఉదయం)**

పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి 17 మంది ప్రాణాలు కోల్పోయారు. శిథిలాల కింద చాలామంది చిక్కుకున్నారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మిరిక్- కుర్సియాంగ్ పర్యాటక ప్రదేశాలను కలిపే దుడియా ఐరన్ వంతెన కూలిపోయింది. కుర్సియాంగ్ సమీపంలోని జాతీయ రహదారి 110 వెంబడి కొండచరియలు విరిగిపడ్డాయి. ఉత్తర బెంగాల్ అంతటా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా జనజీవనం అతలాకుతలమయ్యింది. డార్జిలింగ్‌లోని మిరిక్, సుఖియా పోఖారిలలో కొండచరియలు విరిగిపడి 17 మంది మరణించారు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కొండచరియలు విరిగిపడటంతో పశ్చిమ బెంగాల్ - సిక్కిం మధ్య రోడ్డు సంబంధాలు తెగిపోయాయి. డార్జిలింగ్- సిలిగురి మధ్య ప్రధాన రహదారి మూసుకుపోయింది. భారీ వర్షపాతం జల్పైగురి, సిలిగురి, కూచ్‌బెహార్‌లను ప్రభావితం చేసింది. అనేక ప్రాంతాలు నీటమునిగాయి. చిత్రే, సెల్ఫీ దారా తదితర ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో జాతీయ రహదారి-10లో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సోమవారం ఉదయం వరకు పశ్చిమ బెంగాల్‌లోని ఉప-హిమాలయ జిల్లాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని భారత వాతావరణ శాఖ తెలిపింది. డార్జిలింగ్, కాలింపాంగ్, కూచ్ బెహార్, జల్పైగురి, అలీపుర్దువార్ జిల్లాలలో ఆదివారం అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేయడంతో ఈ ప్రాంతంలో అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు.

### నవంబర్ 22లోగా బిహార్
## ఎన్నికలు పూర్తి

### ఈవీఎంలో ఇక అభ్యర్థుల కలర్ ఫొటోలు: ఈసీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 5 (నమస్తే ఉదయం)**




రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రెండు రోజుల పాటు పర్యటించి, సమీక్షించిన ఎన్నికల సంఘం.. వీటికి సంబంధించిన వివరా లను పట్నాలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించింది. ఈ సందర్భంగా పుట్టిన తేదీ, పౌరసత్వానికి ఆధార్ ధ్రువీకరణ కాదని మరోసారి స్పష్టం చేసింది. చట్టానికి లోబడే ఆధార్‌ను ఉపయోగిస్తున్నామని ఈసీ తెలిపింది.

"అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశాం. గరిష్ఠంగా 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉండనుంది. ఇప్పటికే బూత్ స్థాయి అధికారులకు శిక్షణ పూర్తిచేశాం. ఎన్ని దశల్లో పోలింగ్ నిర్వహించాలనే దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం. ఈవీఎంలలో పొందుపరిచే బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల కలర్ ఫొటోలను ఉంచనున్నాం. తద్వారా అభ్యర్థులను ఓటర్లు తేలికగా గుర్తు పట్టేందుకు వీలుంటుంది. సీరియల్ నంబర్ కూడా పెద్దగా కని పించేలా ఏర్పాట్లు చేస్తున్నాం" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. ఎస్ఐఆర్ ద్వారా అనర్హులను జాబితా నుంచి తొలగించామని, దీన్ని బిహార్ ఓటర్లు కూడా స్వాగతించారని చెప్పారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు తెలి పేందుకు రాజకీయ పార్టీలకు ఇంకా అవకాశం ఉందన్నారు.

243 స్థానాలు కలిగిన బిహార్ అసెంబ్లీకి గడువు 2025 నవంబర్ 22తో

..మిగతా 3లో

## తెలంగాణ బీజేపీలో మరోసారి విభేదాలు

### పార్టీ నడిపే పద్ధతి ఇదేనా?
### మీటింగ్‌లో భగ్గుమన్న ఎంపీ కొండా, ఎమ్మెల్యే కాటిపల్లి!

**హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే ఉదయం)**



తెలంగాణ బీజేపీలో మరో సారి విభేదాలు భగ్గుమన్నాయి. రాష్ట్ర పదాధికారుల సమావేశంలో నేతలు నాయకత్వం తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీలో తీవ్ర సమన్వయ లోపం ఉందని పలువురు మండిపడ్డారు. ముఖ్యంగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పార్టీ అధ్యక్షుల తీరు సరిగా లేదని ఎంపీ కొండా మండిపడ్డారు. సరైన కో ఆర్డినేషన్ లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల వేళ ఇది కరెక్ట్ కాదని అన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి కూర్చోలేని సమస్య ఎందుకు వస్తుంది? అని ఎమ్మెల్యే కాటిపల్లి ఫైర్ అయ్యారు. పార్టీ ఆఫీసుల్లో కూర్చొని కార్యక్రమాన్ని ఎలా డిసైడ్ చేస్తారని ప్రశ్నించారు. ఇలా డిసైడ్ చేసిన కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో అసలు ఉండనే ఉండవని మండిపడ్డారు. జిల్లాల్లో పార్టీ నేతల తీరు కూడా సరిగా లేదన్నారు. గ్రౌండ్ లెవెల్ లో పార్టీ పరిస్థితి అధ్వాన్నంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశాలకు రావడం, వెళ్లడమే మా పనా? అని

..మిగతా 2లో

### పక్కా ప్రణాళికతో
## కరూర్ తొక్కిసలాట
### ఖుష్బూ కీలక వ్యాఖ్యలు



చెన్నై, అక్టోబర్ 5 (నమస్తే ఉదయం) టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ ర్యాలీలో తొక్కిసలాట ఘటనపై నటి, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఖుష్బూ సుందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది పక్కా ప్రణాళికతో, కావాలని చేసినట్లు కన్పిస్తోందని ఆరోపిస్తూ.. తమిళనాడు ప్రభు త్వంపై విరుచుకుపడ్డారు. తొక్కిసలాట ఘటనలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించిందని ఖుష్బూ పేర్కొన్నారు. ఇది ఎవరో కావాలని సృష్టించినట్లు ఉందన్నారు. విజయ్ ర్యాలీకి రాష్ట్ర ప్రభుత్వం

..మిగతా 2లో

## బాబా సాహెబ్ అంబేద్కర్
# ఆలోచన విధానాని కొనసాగిస్తాం

### కోలి సంఘం ప్రధాన కార్యదర్శి వి బి వెంకటనారాయణ

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( ఘట్కేసర్ మున్సిపల్) అక్టోబర్ 05 ఆదివారం (నమస్తే ఉదయం): అంబేద్కర్ ఆలోచన విధానాన్ని కొనసాగిస్తామని కోలి సంఘం ప్రధాన కార్యదర్శి వి బి వెంకటనారాయణ అన్నారు. ఘట్కేసర్ లో ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో 234 వ వారం అంబేద్కర్ నిత్య పూలమాల కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోలి ( ముదిరాజ్ ) సంఘం ప్రధాన కార్యదర్శి వి బి వెంకటనారాయణ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బి సి ల రిజర్వేషన్లతో పాటు మహిళలకు పురుషులతో సమాన హక్కు కోసం కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన ఏకైక వ్యక్తి బాబా సాహెబ్ అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ప్రజల వద్దకు తీసుకు వెళ్లడానికి ప్రతి ఆదివారం నిత్య పూలమాల కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయం అన్నారు స్వాతంత్రం


ఘట్కేసర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాలను వేసి నివాళులర్పిస్తున్న వెంకటనారాయణ.

వచ్చిన తరువాత భారతదేశానికి ఒక దశ దిశను నిర్దేశించిన మహానేత అంబేద్కర్ అని చెప్పారు. 60 దేశాల రాజ్యాంగాలను చదివి భారతదేశానికి తలమానికంగా నిలవడానికి కుల, మత, ప్రాంతాలకు అతీతంగా రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. 2026 లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించే కుల గణనలో అందరూ పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి వారం బహుజనులను సమీకరించి మహనీయుల చరిత్రను తెలియజేయటం బహుజన రాజ్యాధికారానికి పునాది వేసిన వారమవుతామని తెలిపారు. మహనీయుల జీవిత చరిత్రను తెలుసుకొని వాళ్ల ఆశయ సాధన కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న ప్రబుద్ధ భారత్ ప్రతినిధులను అభినందించారు. ప్రజలను చైతన్య పరుస్తున్న అరుణ్ కుమార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోలి ( ముదిరాజ్ ) సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బర్ల దేవేందర్, కార్యనిర్వాహక సభ్యుడు ఊదారి సుదర్శన్, కే విజయ్ కుమార్, రైతు సేవ సహకార సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి రాంరెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మేకల దాస్, ఈ డబ్ల్యూ ఎస్ కాలనీ అధ్యక్షుడు బండారి రాందాస్, కె మల్లేష్, కే నర్సింగరావు, కే ఈశ్వర్, అంకం సురేష్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, పి దామోదర్ రెడ్డి, వెంకటాచారి, ఎం వెంకటేష్, శంకర్, బి గణేష్ గౌడ్, ఎస్ కృష్ణంరాజు, సి ఉపేందర్, డి భరత్, ఈ విష్ణు, లలిత తదితరులు పాల్గొన్నారు.


అల్వాల్ లో 99 బజార్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## ప్రతి ఒక్కరు ఉపాధి రంగాలపై దృష్టి సారించాలి:
### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి (మల్కాజిగిరి నియోజకవర్గం) అల్వాల్ అక్టోబర్ 05 (నమస్తే ఉదయం): విద్యావంతులైన ప్రతి ఒక్కరు నిరుద్యోగులుగా మారకుండా ఉపాధి రంగాలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం అల్వాల్ లో 99 బజార్ ను శాలిని భగత్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి పాల్గొని 99 బజార్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతులైన ప్రతి ఒకరు నిరుద్యోగులుగా మారకుండా ఉపాధి రంగాలపై దృష్టి సారించాలని అన్నారు. 99 బజార్లో ఏ వస్తువు కొనుగోలు చేసిన 99 రూపాయలకే లభిస్తుందని నిర్వాహకులు తెలిపారని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్లన్నారు. యువత స్వయం ఉపాధిలో రాణిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాస్, సురేష్, జార్జ్, ప్రేమ్ కుమార్, లోకేష్ కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.



వెంకటేశ్వర కాలనీ ఎమ్మార్పీఎస్ కమిటీ నాయకులతో సీనియర్ నాయకులు పోతురాజు యాదయ్య, ననాగారి రామచందర్ మాదిగ తదితరులు

## వెంకటేశ్వర కాలనీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షునిగా కె. వెంకటరమణ మాదిగ

బుద్వేల్, అక్టోబరు 5 (నమస్తే ఉదయం) – మైలార్ దేవుపల్లి డివిజన్ వెంకటేశ్వర కాలనీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షునిగా కథల వెంకటరమణ మాదిగ నియమితులైనారు. ప్రధాన కార్యదర్శిగా బి.కరణ్ మాదిగ, ఉపాధ్యక్షులుగా కె రాజు మాదిగ, సంయుక్త కార్యదర్శిగా జి.నరేష్ మాదిగ నియమితులైనారు. ఆదివారం సాయంత్రం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పోతురాజు యాదయ్య మాదిగ, ననాగారి రాంచందర్ మాదిగ, నూరి బాబురావు మాదిగ చెరుకూరి మన్యం మాదిగ, లింగని క్రిష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ కమిటీ ని ఎన్నుకున్నారు.

## విజయవాడ-హైదరాబాద్ హైవేపై
# వాహనాల రద్దీ

**మొదటి పేజీ తరువాయి...**

ఉండగా.. విజయవాడ మార్గంలో కేవలం నాలుగు బూత్‌లను మాత్రమే తెరిచి వాహనాలను పంపించారు. టోల్‌ప్లాజా అధికారులు, రాచకొండ ట్రాఫిక్ పోలీసులు సమన్వయం చేసుకొని వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. భువనగిరి ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, చౌటుప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌మోహన్ ఆధ్వర్యంలో రాచకొండ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


జన్మదినం జరుపుకుంటున్న ప్రొఫెసర్ కంచె ఐలయ్య చిత్రపటాన్ని ఆయనకు అందచేస్తున్న ప్రొఫెసర్ రాంసింగ్

## ప్రొఫెసర్ కంచె ఐలయ్య చిత్రపటాన్ని ఆయనకు అందచేసిన ప్రొఫెసర్ రాంసింగ్

బుద్వేల్, అక్టోబరు 5 (నమస్తే ఉదయం) : ప్రముఖ సామాజిక, రాజకీయ సిద్ధాంత కర్త, రచలు ఎత, దళిత హక్కుల ఉద్యమకారుడు ప్రొఫెసర్ కంచె ఐలయ్య షెఫర్డ్ జన్మదినం సందర్భంగా పీవీ నర్సింహ్మారావు పశువైద్య విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రాంసింగ్ స్వయంగా గీసిన చిత్రపటాన్ని ప్రొఫెసర్ కంచె ఐలయ్యకు ఆదివారం బహుకరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాంసింగ్ మాట్లాడుతూ, ప్రొఫెసర్ కంచె ఐలయ్య గొప్ప మేదావి అని కొనియాడారు. ఉస్మానియ విశ్వవిద్యాలయంలో రాజకీయ శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ గా, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీలోని సామాజిక విసర్జన, సమన్వయ విధానాల అధ్యయన కేంద్రం డైరెక్టర్ గా సేవలందించారన్నారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ ఓబీసీ సలహా కమిటీ సభ్యులుగా కూడా ఆయన సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్ దేవరకొండ, ప్రొఫెసర్ సునీల్ అనంద లు పాల్గొన్నారు.

# వడ్డీతో సహా చెల్లిస్తాం

### కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లారా జాగ్రత్త.. హరీష్ రావు హెచ్చరిక

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే ఉదయం)




కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేశా రు. ఆదివారం ఎల్లారెడ్డి నియోజక వర్గం గాంధారి మండలంలో నిర్వహించిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి హరీష్ రావు హాజర య్యారు. ఈ సందర్భంగా హరీష్ రావు సమక్షంలో పలువురు బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం హరీష్ రావు మాట్లాడుతూ.. ఉద్యమకారుడు తానాజీ బీజేపీకి వెళ్లి తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరినందుకు సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రజలకు స్పష్టత వచ్చేసింది. మల్లొచ్చే ప్రభుత్వం ఏదని ఎవరిని అడిగినా బీఆర్ఎస్ పక్కా అని అంటున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిపోయింది, ఉన్నది ఇంకా రెండేళ్లు మాత్రమే.. మనమందరం కలిసికట్టుగా పనిచేస్తే మళ్ళీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. బీజేపీ దేశం కోసం ధర్మం కోసం అంటూ డైలాగులు కొట్టడం తప్ప.. బీజేపీపేదలు, దళితుల పక్షాన ఉండదని అన్నారు. కేవలం నార్త్ ఇండియా వైపే ఉంటుందని చెప్పారు. తెలంగాణ ఇండియాలో లేదా? అసలు తెలంగాణకు నిధులు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. తెలంగాణకు శ్రీరామరక్ష అంటే బీఆర్ఎస్ పార్టీనే అన్నారు... జాతీయ పార్టీలు తెలంగాణకు అన్ని విధాల అన్యాయాలే చేస్తాయి. తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు గెలిచి ఉంటే ఢిల్లీలో బీజేపీ మెడలు వంచి నిధులు తీసుకొచ్చే వాళ్లం.. కానీ.. ఇక్కడి బీజేపీ నేతలకు చేతగావడం లేదని విమర్శించారు. 157 మెడికల్ కాలేజీలను కేంద్రం ప్రకటిస్తే ఒక్క మెడికల్ కాలేజ్ కూడా తెలంగాణకు ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ నేతలు అవినీతిలో కూరుకుపోయారని ఆరోపించారు. వరదల వల్ల పంటనష్టపోయిన రైతులకు ఇంతవరకు పరిహారం ఇవ్వలేదని మండిపడ్డారు. తొందర్లో కాంగ్రెస్ బాకీ కార్డులు నియోజకవర్గానికి వస్తాయి.. ప్రతి ఇంటికి బాకీ కార్డులను చేర్చాలని నేతలకు సూచించారు. రేవంత్ రెడ్డి అంటే చీఫ్ మినిస్టర్ కాదు కటింగ్ మాస్టర్ అని విమర్శించారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన వాళ్లను అరెస్టు చేస్తున్నారు.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లారా జాగ్రత్త.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. కార్యకర్తలు ధైర్యంగా ముందుకు వెళ్ళండి. వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే అని హరీష్ రావు ధైర్యం చెప్పారు.


కేంద్ర మాజీ మంత్రి జి వెంకటస్వామి జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న రాజేంద్రనగర్ దళిత సంఘాల నాయకులు

## కేంద్ర మాజీ మంత్రి దివంగత జి.వెంకటస్వామీకి నివాళులర్పించిన దళిత నాయకులు

బుద్వేల్, అక్టోబరు 5 (నమస్తే ఉదయం): కేంద్ర మాజీ మంత్రి, దివంగత జి.వెంకటస్వామి జయంతి సందర్భంగా రాజేంద్రనగర్ లో దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో వెంకటస్వామి చిత్రపటానికి అదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సత్యార నర్సింహ్మా, గొడుగు సంజీవ, పంబాల రాజు, మంత్రి చంద్రశేఖర్, మంగళారం శ్రీనివాస్, సత్యార రాజు, ఎస్ పెంటయ్య, పచ్చ నర్సింగ్ రావు , శ్రీకాంత్, సంజు. కొత్తపల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ బీజేపీలో
# మరోసారి విభేదాలు

**మొదటి పేజీ తరువాయి...**

నాయకత్వాన్ని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో ఎందుకు పార్టీ కార్యక్రమాలు లేవని ఫైర్ అయ్యారు. ప్రజాప్రతినిధులతో జిల్లా నేతలకు సరైన సమన్వయం లేదని మరో ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. సరైన నేతలకే ఇన్ ఛార్జ్ బాధ్యతలు ఇవ్వాలని ఎంపీ డీకే అరుణ సూచించారు.

**సమష్టిగా ముందుకెళ్దాం: బీజేపీ చీఫ్**

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ.. సమస్యలు అన్నింటినీ సరి చేసుకొని సమష్టిగా ముందుకు వెళ్దామని సూచించారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లా ఇష్యూ పై కమిటీ వేస్తామని ప్రకటించారు. ఇదిలా ఉంటే.. స్థానిక ఎన్నికలకు బీజేపీ సిద్ధం అవుతోంది. ఈక్రమంలో ఈ నెల 8న పార్టీ రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం నిర్వహించనుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులు, కీలక నేతలు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. 15 జడ్పీటీసీలు గెలవడమే తమ లక్ష్యమని బీజేపీ చెబుతోంది. ఇందుకోసం జిల్లా అధ్యక్షుడు, ఇన్చార్జి, అబ్జర్వర్ తో త్రిసభ్య కమిటీ వేయనుంది. అనంతరం జిల్లాల వారీగా బహిరంగ సభలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రాంచందర్ రావు ముందు రెండు ప్రధాన్ ఛాలెంజ్ లు ఉన్నాయి. అందులో ఒకటి స్థానిక ఎన్నికలు కాగా.. రెండవది జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు. ఈ రెండు ఎన్నికలు ఆయనకు అగ్ని పరీక్ష అన్న చర్చ కూడా సాగుతోంది. ఈ ఎన్నికల్లో ఏ మాత్రం ప్రతికూల ఫలితాలు వచ్చినా ఆయన నాయకత్వంపై విమర్శలు వచ్చే అవకాశం ఉంది.

## పక్కా ప్రణాళికతో
# కరూర్ తొక్కిసలాట

**మొదటి పేజీ తరువాయి...**

సరైన స్థలం ఇవ్వలేదని విమర్శించారు. 41 మంది ప్రాణాలు కోల్పోయారని.. మౌనంగా ఉన్న సీఎం స్టాలిన్ దీనిపై మాట్లాడాలన్నారు. ర్యాలీలో పోలీసులు లాఠీ ఛార్జ్ ఎందుకు చేశారని ఆమె ప్రశ్నించారు. దీనికి సంబంధించిన చాలా వీడియోలు బయటకు వచ్చాయన్నారు. కరూర్‌లో విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి టీవీకేకు సంబంధించిన కొందరిని పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దీన్ని తొలుత వ్యతిరేకించిన న్యాయస్థానం.. ఆ తర్వాత సిట్ దర్యాప్తునకు ఆదేశించింది.

## దగ్గుమందు తాగి
# 11 మంది చిన్నారులు మృతి

న్యూఢిల్లీ, అక్టోబర్ 5 (నమస్తే ఉదయం) మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారాలో ఇప్పటివరకు 11 మంది పిల్లలు చనిపోయారు. వారిలో ఒకరైన అద్నాన్ తల్లిదండ్రులు. మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా జిల్లాలో దగ్గుమందు తాగిన తర్వాత 11 మంది చిన్నారులు మృతి చెందిన విషాద ఘటనకు సంబంధించి కేసు నమోదైంది. ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ ప్రవీణ్ సోనీ, దగ్గుమందు తయారీ సంస్థ శ్రీసాన్ ఫార్మాస్యూటికల్స్ యాజమాన్యంతో పాటు ఇతర బాధ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. అక్టోబర్ 5న, పరాసియా బ్లాక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అంకిత్ సహ్లామ్ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. జిల్లా యంత్రాగం తెలిపిన వివరాల ప్రకారం, మరణించిన 11 మందిలో 10 మంది ప్రభుత్వ పీడియాట్రిషన్‌గా డాక్టర్ ప్రవీణ్ సోని పనిచేస్తున్న పరాసియా బ్లాక్ పరిధిలోని వారే. బీబీసీకి అందిన ఎఫ్ఐఆర్ కాపీ ప్రకారం, “2025 ఆగస్టు నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో ఐదేళ్లలోపు వయసున్న అనేక మంది చిన్నారులు జలుబు, దగ్గు, జ్వరంతో పరాసియా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేరారు. వీరిలో చాలామందికి డాక్టర్ ప్రవీణ్ సోనీ 'కోల్డ్రిఫ్' దగ్గుమందు(కాఫ్ సిరప్) తో పాటు ఇతర మందులు ఇచ్చారు. కొన్ని రోజుల తర్వాత పిల్లల్లో మూత్రం ఆగిపోవడం, ముఖం ఉబ్బడం, వాంతులు వంటి లక్షణాలు కనిపించాయి. విచారణలో వీరికి కిడ్నీ ఫెయిల్యూర్ అయినట్లు తేలింది.”

ఎఫ్ఐఆర్ ప్రకారం, బాధితులలో పలువురిని నాగ్‌పూర్ తరలించగా చికిత్స పొందుతూ 10 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి



### బి ఆర్ ఎస్ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్5 (నమస్తే ఉదయం)త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గద్వాల జిల్లా పై గులాబీ జెండా ఎగురవేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని.. ఇందుకోసం కార్యకర్తలంతా సమష్టిగా ముందుకెళ్లాల్సిన అవసరముందని బిఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజక వర్గ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు అన్నారు.ఆదివారం గద్వాల్ పట్టణంలో బాసు హనుమంతు నాయుడు స్వగృహం నందు కేటిధొడ్డి మండలం కొండాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాసు హన్మంతునాయుడు మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికలను నాయకులు, కార్యకర్తలు ఆషామాషీగా తీసుకోవద్దని, రాత్రిబవంళ్లు కష్టపడి పనిచేస్తేనే మన లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలవాల్సిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. మనమంతా ధైర్యంగా ముందుకెళ్లి సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకోవల్సిన అవసరం ఉందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల ముందుకెళ్లి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన దిశానిర్దేశం చేశారు.బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో కొండాపురం గ్రామానికి చెందిన గోపాల్ రెడ్డి, చిన్న నర్సింరెడ్డి, రఘునాథ్ రెడ్డి, మహానంద రెడ్డి, డోలు వీరన్న, నాగిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, వీరారెడ్డి, పెద్ద రంగన్న రెడ్డి, తిమ్మారెడ్డితో పార్టీ ముఖ్య నాయకులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జి.రాఘవేంద్ర రెడ్డి, వెంకటేష్ నాయుడు, చక్రిధర్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, శ్రీరాములు, భరత్ సింహారెడ్డి, గోవిందు, ప్రహ్లాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## బీఈడీ కళాశాల విద్యార్థుల వీడ్కోలు వేడుకలు

కొత్తకోట,అక్టోబర్ 5 (నమస్తే ఉదయం)కొత్తకోట మండలం అమడబాకుల సమీపంలో గల మానస బీఈడీ కళాశాల 2023-25 విద్యార్థులు బీఈడీ, పూర్తిచేసుకుని వీడ్కోలు సమావేశాన్ని ఆదివారం ఏర్పాటు చేసుకున్నారు. కళాశాల అధ్యాపకులతో తమకు ఉన్న జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.జూనియర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థులను వీడ్కోలు పలుకుతూ ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తమకు పాఠాలు నేర్పిన అధ్యాపకులను ఘనంగా ఈ సందర్భంగా సన్మానించారు. గత రెండేళ్లుగా ఇందిర టీచర్ తో ఉన్న తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకొని విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు.వీడ్కోలు కార్యక్రమంలో సంప్రదాయ వస్త్రాలు ధరించి విద్యార్థులు చేసిన ప్రదర్శనలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మెన్ సాక బాలనారాయణ, సాక నరసింహులు, ప్రిన్సిపాల్ మురళీ యాదవ్, అధ్యాపకులు దీపక్, రామ చంద్రయ్య , ప్రసాద్, అంజూమ్, భీమ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైన శ్రీనివాస్



కేటిదొడ్డి, అక్టోబర్ 5(నమస్తే ఉదయం) కర్ణాటకలోని రాణి చెన్నమ్మ యూనివర్సిటి బెళగావి లో నిర్వహించే సౌత్ జోన్ కబడ్డీ టోర్నమెంట్ కి గద్వాల జిల్లా వాసి ఎంపికయ్యాడు.పాలమూరు యూనివర్సిటీ మాస్టర్ అఫ్ సోషల్ వర్క్ లో పీజీ విద్యనభ్యసిస్తున్న కేటిదొడ్డి మండలం మల్లాపురం గ్రామానికి చెందిన శ్రీనివాస్ సౌత్ జోన్ కబడ్డీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. గద్వాల జిల్లా వాసి సౌత్ జోన్ కబడ్డీ టోర్నమెంట్‌కు ఎంపిక పట్ల గ్రామస్తులు,కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



## గ్రామ ప్రజలను చైతన్యవంతం చేయాలి

### ఎన్ఎస్ఎస్ చైర్మన్, కళాశాల ప్రిన్సిపాల్ వీరన్న

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5(నమస్తే ఉదయం) గద్వాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కో -ఎడ్యుకేషన్ ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 వాలంటీర్లు ఆదివారం గుంటిపల్లి , కొత్తపల్లి గ్రామాలలో స్వచ్ఛ భారత్ లో భాగంగా గ్రామాలలోని రోడ్లు , ప్రాథమికోన్నత పాఠశాల గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న పిచ్చి మొక్కలు తీసివేసి రోడ్లను శుభ్రం చేసి పరిసర ప్రాంతాలలో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ వీరన్న విచ్చేసి వాలంటీర్లు పనిచేస్తున్న తీరు గమనించారు వాలంటీర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నేటి యువతే మన దేశానికి వెన్నెముక లాంటి వారిని ఎన్ఎస్ఎస్ ద్వారా వారికి సేవా దృక్పథం అలవర్చుకుంటారని పెద్దలను అధ్యాపకులను ఎప్పుడు గౌరవిస్తూ ఉండాలని గ్రామ ప్రజలలో నిరక్షరాస్యత పారద్రోలి అక్షరాస్యత పెంచాలని పాఠశాలకు రాని విద్యార్థులను పాఠశాలకు వచ్చేటట్టుగా చైతన్యవంతం చేయాలని కోరారు. కొత్తపల్లి గుంటిపల్లి లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎయిడ్స్ నిర్మూలన మత్తుమందుల నిర్మూలన గూర్చి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ బోరవెల్లి పవన్ కుమార్, వీరేశం, వాలంటీర్లు పాల్గొన్నారు.




## ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకై నిలుద్దాం

### స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5(నమస్తే ఉదయం) ప్రజా సమస్యల పరిష్కారం దిశగా నిరంతరం పోరాటం చేయాలని అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నడిగడ్డ హక్కుల పోరాట సమితి తరపున అభ్యర్థులు పోటీచేసి విజయం సాధించాలని జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్ అన్నారు. ఆదివారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యాలయంలో కె.టి.దొడ్డి మండల ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నడిగడ్డ ప్రాంతంలో అట్టడుగు వర్గాల పేద ప్రజల తరపున నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రాజీలేని పోరాటం చేస్తూ ప్రశ్నించే గొంతుకగా పేదల పక్షాన నిలవాలని కోరారు. అనేక సమస్యలపై ఉద్యమాలు చేస్తూనే బహుజనులను చైతన్యపరిచి రాజాధికారం దిశగా ముందుకు వెళ్లడానికి నడిగడ్డ హక్కుల పోరాట సమితి అనేక సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో నడిగడ్డ హక్కుల పోరాట సమితి తరపున అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని సమితి నాయకులకు దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండి ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకొని వారికి అండగా నిలవాలన్నారు. రాబోయే ఎన్నికల్లో గెలుపుకోసం పని చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు మండల నాయకులు సుభాష్, వన్నప్ప, రేనప్ప, స్వామి, బట్టు రంగస్వామి,ఏసన్న, సామియేల్,ఎల్లేష్,తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలి:

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

కేటిదొడ్డి, అక్టోబర్ 5(నమస్తే ఉదయం)స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో బీజేపీ జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. కేటిదొడ్డి మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి అధ్యక్షతన మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు వివరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలే పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తాయన్నరు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని పథకాలను ప్రజలకు వివరిస్తూ మోసపూరిత వాగ్ధానాలను ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండానే మరోసారి స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన తర్వాతనే స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ప్రభారి కిష్టన్న, బిజెపి సీనియర్ నాయకులు అనిమిరెడ్డి భీమిరెడ్డి, అశోక్, మైలగడ్డ రాములు, చింతలకుంట రాముడు, కృష్ణ కాంత్, మొగిలి వీరేష్, నాగిరెడ్డి, అంపయ్య, కుచినెర్ల నరసింహ ,దేవేందర్ రెడ్డి రంగాపురం కృష్ణ, కొండయ్య ముని ,వంశీ వివిధ గ్రామాల ఎంపీటీసీ అభ్యర్థులు తదితరులు,పాల్గొన్నారు.



## స్థానిక ఎన్నికలలో సీపీఐ పార్టీ అభ్యర్థులు పోటీలో ఉంటారు

### పార్టీ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్5(నమస్తే ఉదయం)రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ తరఫున జడ్పిటిసి ఎంపిటిసి స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీలో ఉంటారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల్లో జడ్పిటిసి ఎంపిటిసి స్థానాలకు పోటీ చేసే అంశంపై లోతుగా చర్చించి ఎంపిటిసి జడ్పిటిసి స్థానాల్లో పోటీ చేయడానికి ఆ పార్టీ నిర్ణయించినట్లు జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వందేళ్లుగా పేదల కోసం నిరంతరంగా పోరాటం సాగిస్తున్నటువంటి భారత కమ్యూనిస్ట్ పార్టీ ప్రజల తరపున నిలబడుతుందని ప్రజలు ఆదరించి గ్రామాల్లో ఎంపిటిసి, జడ్పిటిసి అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సాధ్యమైనంతవరకు ఎక్కువ స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నట్లు ఆయన తెలిపారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నటువంటి రిజర్వేషన్ల వివరాలను రాజకీయ పార్టీలకు అందించడంలో జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రంగన్న, పెద్దబాబు ఆశన్న, రవి, కాసిం పరమేష్ కిష్టన్న తదితరులు పాల్గొన్నారు.



ఔటర్ రింగు రోడ్డు పై ఒకదానికొకటి డీ కొన్న కార్లు

## ఓఆర్ఆర్‌పై వరుసగా ఆరు కార్లు ఢీ

### ఇద్దరికీ స్వల్ప గాయాలు

### రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

బుద్వేల్, అక్టోబరు 5 (నమస్తే ఉదయం) : ఔటర్ రింగ్ రోడ్డుపై వరుసగా ఆరు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి.రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఈ ఘటన జరిగింది. శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వైపు వెళుతుండగా ఎస్ క్రాస్ కారు డ్రైవర్ హిమాయత్ సాగర్ వద్ద సడన్ గా బ్రేక్ వేశాడు.దింతో వరుసగా ఆరు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఔటర్ రింగ్ రోడ్డుపై రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఈ ప్రమాదంలో ఆరు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి . కారులోని బెలూన్స్ ఓపెన్ కావడంతో ప్రమాదం తప్పింది. కార్లు ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరికీ స్వల్ప గాయాలు అయ్యాయి. ఔటర్ పై ఏర్పడిన ట్రాఫిక్ ను రాజేంద్రనగర్ లాండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు క్లియర్ చేశారు. ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నామని, కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.



రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షునిగా నియమితులైన మంగళారం శ్రీనివాస్ ను సన్మానిస్తున్న దళిత సంఘాల నాయకులు పత్యార నర్సింహ్మా, మంబాల రాజు - బుద్వేల్ నమస్తే ఉదయం



రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పి రవీందర్ (చిన్న) తో పాటు కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ మాజీ అధ్యక్షులు ఈ శ్రీకాంత్

## వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు సన్మానం

బుద్వేల్, అక్టోబరు 5 (నమస్తే ఉదయం) : రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షునిగా పనిచేసిన పి.రవీందర్(చిన్న) ఆధ్వర్యంలో వారి కమిటీ సభ్యులు ఎంతో చక్కగా పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేశారని, వినాయక ఉత్సవ కమిటీ పూర్వ అధ్యక్షులు ఈ శ్రీకాంత్ అన్నారు. అదివారం నవజ్యోతి యూత్ క్లబ్ లో క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంగళారం శ్రీనివాస్, శ్యామల గంగాధర్ ల సమక్షంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం కలసి విందులో పాల్గొన్నారు.

# నవంబర్ 22లోగా బిహార్ ఎన్నికలు పూర్తి

మొదటి పేజీ తరువాయి...

ముగియనుంది. ఆ గడువులోగా కొత్త ప్రభుత్వం కొలువుదీరాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించిన ఈసీ.. గడువులోగా పూర్తి చేస్తామని చెప్పింది. అయితే, ఒకటి, రెండు దశల్లోనే వీటిని పూర్తి చేయాలనే అభ్యర్థనలు వచ్చాయని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. 2020లో మూడు విడతల్లో పోలింగ్ జరగ్గా.. అంతకుముందు (2015లో) ఐదు విడతల్లో పోలింగ్ జరిగింది. ఇదిలాఉంటే, రాష్ట్రంలో 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ఈసీ ఇటీవల వెల్లడించింది. బిహార్‌లో నవంబర్ 22లోగా అసెంబ్లీ ఎన్నికలను పూర్తి చేస్తామని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. తొలిసారిగా ఈవీఎంలలో పొందుపరిచే బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల కలర్ ఫొటోలను ఉంచ నున్నట్లు తెలిపింది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రెండు రోజుల పాటు పర్యటించి, సమీక్షించిన ఎన్నికల సంఘం.. వీటికి సంబంధించిన వివరా లను పట్నాలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించింది. ఈ సందర్భంగా పుట్టిన తేదీ, పౌరసత్వానికి ఆధార్ ధ్రువీకరణ కాదని మరోసారి స్పష్టం చేసింది. చట్టానికి లోబడే ఆధార్‌ను ఉపయోగిస్తున్నామని ఈసీ తెలిపింది."అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశాం. గరిష్ఠంగా 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉ ఒడనుంది. ఇప్పటికే బూత్ స్థాయి అధికారులకు శిక్షణ పూర్తిచేశాం. ఎన్ని దశల్లో పోలింగ్ నిర్వహించాలనే దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం. ఈవీఎంలలో పొందుపరిచే బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల కలర్ ఫొటోలను ఉంచనున్నాం. తద్వారా అభ్యర్థులను ఓటర్లు తేలికగా గుర్తు పట్టేందుకు వీలుంటుంది. సీరియల్ నంబర్ కూడా పెద్దగా కని పించేలా ఏర్పాట్లు చేస్తున్నాం" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. ఎస్ఐఆర్ ద్వారా అనర్హులను జాబితా నుంచి తొలగించామని, దీన్ని బిహార్ ఓటర్లు కూడా స్వాగతించారని చెప్పారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు తెలి పేందుకు రాజకీయ పార్టీలకు ఇంకా అవకాశం ఉందన్నారు.243 స్థానాలు కలిగిన బిహార్ అసెంబ్లీకి గడువు 2025 నవంబర్ 22తో ముగియనుంది. ఆ గడువులోగా కొత్త ప్రభుత్వం కొలువుదీరాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించిన ఈసీ.. గడువులోగా పూర్తి చేస్తామని చెప్పింది. అయితే, ఒకటి, రెండు దశల్లోనే వీటిని పూర్తి చేయాలనే అభ్యర్థనలు వచ్చాయని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. 2020లో మూడు విడతల్లో పోలింగ్ జరగ్గా.. అంతకుముందు (2015లో) ఐదు విడతల్లో పోలింగ్ జరిగింది. ఇదిలాఉంటే, రాష్ట్రంలో 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ఈసీ ఇటీవల వెల్లడించింది.

